క్లుప్తంగా

సీజేఐపై దాడి అమానుషం



మాట్లాడుతున్న నాగేంద్రనాథ్

కదిరి అర్బన్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి అమానుషమని మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు నాగేంద్రనాథ్ పేర్కొన్నారు. గురువారం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. మన దేశంలో న్యాయవ్యవస్థను ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా గుర్తిస్తారన్నారు. అలాంటి పవిత్రమైన వృత్తిలో ఉన్న సుప్రీం కోర్టు న్యాయమూర్తిపై దాడి చేయడం శోచనీయమన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ నాయకులు పోతులయ్య, శ్రీనివాసులు, రాజు, శ్రీరాములు పాల్గొన్నారు.

ఓబుళాపురంలో పంటకోత ప్రయోగం



పంటకోత ప్రయోగం నిర్వహిస్తున్న అధికారులు

బత్తలపల్లి: ఓబుళాపురం గ్రామంలోని రైతు టి.ఆదినారాయణ సాగు చేసిన వేరుశనగ పొలం(సర్వే నంబర్ 63–4ఎ)లో పంటకోత ప్రయోగాలను అధికారులు నిర్వహించారు. ఇందులో నిర్ణీత విస్తీర్ణంలో 3.340 కేజీల దిగుబడి వచ్చినట్లు అధికారులు తెలిపారు. వ్యవసాయాధికారి ఓబిరెడ్డి ఆధ్వర్యంలో పంటకోత ప్రయోగం చేపట్టగా ఏఎస్ఓ డాక్టర్ కెఎస్ లక్ష్మీనరసింహశర్మ పర్యవేక్షించారు. వీఏఏ కె.నాగార్జున, ఏఈఓ శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

ధర్మవరంలో మోస్తరు వర్షం

ధర్మవరం రూరల్: మండలంలో గురువారం తెల్లవారు జామున మోస్తరు వర్షం కురిసింది. ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలో 198.4 మి.మీటర్ల వర్షపాతం నమోదైనట్లు డిప్యూటీ ఎస్ఓ గోపాల్ తెలిపారు. బత్తలపల్లిలో 84.8 మి.మీటర్లు ధర్మవరంలో 15.2 మి.మీటర్లు, తాడిమర్రిలో 17.2, ముదిగుబ్బలో 16.6, కనగానపల్లిలో 8.4, చెన్నేకొత్తపల్లిలో 29.8, రామగిరిలో 26.4 మి.మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు. రైతులు సాగు చేసిన వేరుశనగ, కంది పంటలు వర్షం లేక ఎండుముఖం పట్టాయి. అయితే కురిసిన వర్షంతో పంటలకు జీవం వచ్చి నట్లయిందని రైతులు తెలిపారు. వసంతపురం గ్రామంలో ఈదురు గాలులతో కూడిన వర్షానికి రైతు కాటమయ్యకు చెందిన అరటి చెట్లు నేలకొరిగాయి.

అండర్-19 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



పవన్



నవ్య

ధర్మవరం అర్బన్: అండర్–19 విభాగంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ధర్మవరం విద్యార్థులు ఎంపికైనట్లు కబడ్డీ కోచ్ పృథ్వీ తెలిపారు. స్థానిక ఆర్డీటీ క్రీడా మైదానంలో విద్యార్థులను గురువారం కోచ్ అభినందించారు. ఈనెల 8న అనంతపురంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి కబడ్డీ పోటీలలో ధర్మవరం క్రీడాకారులు పవన్, నవ్య ప్రతిభ కనబరిచాన్నారు. దీంతో నిర్వాహకులు వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు.

రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందిస్తున్న దృశ్యం

ధర్మవరం రూరల్: పట్టణంలోని రిషి పాఠశాల విద్యార్థులు ఎన్వీ సిరి, వైశాలిని, ఫి, షణ్ముఖ కుమార్‌రెడ్డి రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డీన్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గత నెల 25, 26 తేదీల్లో కర్నూలులో నిర్వహించిన రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలలో పాల్గొని తమ విద్యార్థులు సత్తా చాటారన్నారు. ఏపీ షూటింగ్ బాల్ కార్యదర్శి పరశురామ్, జిల్లా కార్యదర్శి ఉదయ్‌కిరణ్, ప్రెసిడెంట్ శీను,ఫీటీ గణేష్, వైస్ ప్రిన్సిపాల్ కళ్యాణి, ఏఓ రంగారెడ్డి విద్యార్థులను అభినందించారు.

ముదిగుబ్బ: అనంతపురంలో బుధవారం జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్–14 హ్యాండ్ బాల్ పోటీల్లో స్థానిక పీవీఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థి కె. ముఖేష్ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ పీవీ నాయుడు గురువారం తెలిపారు. పాఠశాల చైర్మన్, పీఈటీ జ్యోతి యాదవ్, ప్రిన్సిపాల్ మనీషా విద్యార్థిని అభినందించారు.

ప్రగతిబాట పడేదెన్నడు?



కంకర తేలిన టీ.ఎన్.పల్లి రహదారి



మరికొమ్మదిన్నె సమీపంలో రహదారి దుస్థితి

- టీఎన్‌పల్లి రోడ్డు అభివృద్ధిపై నీలినీడలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీసీరోడ్డు, కల్వర్టుల పూర్తి
- కూటమి ప్రభుత్వం వచ్చాక ఆగిన పనులు
- రోడ్డు పూర్తి చేయాలని కోరుతున్న ప్రజలు

ఎన్‌పీకుంట: మండలంలోని టీఎన్‌పల్లి వరకు చేపట్టిన డబుల్‌రోడ్డు పనులపై నీలినీడలు అలుముకుంటున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 16 నెలలు పూర్తి కావస్తున్నా రహదారి పనులు పూర్తి చేసే దిశగా ఎలాంటి చర్యలు కనిపించడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తలుపుల నుంచి ఎన్.పీ.కుంట వరకు డబుల్ రోడ్డు నిర్మాణం కోసం సుమారు రూ.22.50 కోట్లు సీఆర్ఐఎఫ్ నిధులు మంజూరయ్యాయి. మండల కేంద్రంలోని కొత్త రోడ్డు (సోలార్ జంక్షన్) వద్ద నుంచి టీ.ఎన్.పల్లి వరకు సుమారు 11.4 కి.మీ రూ.16.04 కోట్ల(సీఆర్ఐఎఫ్ నిధులు)తో 2023 సెప్టెంబరులో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా నాలుగు స్లాబ్ కల్వర్టులు, 8 సింగిల్ రో, 8 డబుల్‌రో కల్వర్టులతో పాటు 1.8 కి.మీ. సీసీరోడ్డును పూర్తి చేశారు. తారు వేయడం కోసం కంకర తోలించి సిద్ధం చేశారు.

ప్రజలకు తప్పని తిప్పలు..

సార్వత్రిక ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పనులు చేసిన కాంట్రాక్టర్‌కు ఒక బిల్లు కూడా మంజూరు కాకపోవడంతో రోడ్డు పనులు ఆగిపోయాయి. దీంతో కంకర తేలిన రోడ్డుపై ప్రయాణం చేయాలంటే వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంకర తేలడంతో భారీ వాహనాలు, బస్సులు, కార్లు వెళ్లే క్రమంలో భారీగా దుమ్ము రేగుతోందని, దీనికి తోడు గుంతలు ఏర్పడటంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకువస్తుందోనని వాహనచోదకులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అధికారులు స్పందించాలి



ఎన్.పీ.కుంట నుంచి టీ.ఎన్.పల్లి వరకు రోడ్డు అధ్వానంగా ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో డబుల్‌రోడ్డు మంజూరై, సీసీ రోడ్లు, కల్వర్టులు పూర్తయ్యాయి. ప్రభుత్వం మారిన తరువాత పనులు జరగలేదు. దీనితో అప్పట్లో పరచిన కంకర తేలిపోయింది. దీనితో రోడ్డుపై ప్రయాణం చేయాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి తారు రోడ్డు పనులు పూర్తి చేసి సమస్య పరిష్కరించాలి.

– దుద్దుకుంట వెంకటరెడ్డి, చయ్యప్పగారిపల్లి

రోడ్డు పనులు పూర్తి చేసి, ప్రమాదాలు నివారించాలి



గోతులతో పాటు కంకర రాళ్లు లేచి ఉండటంతో ప్రమాదాలు జరుగుతుంటాయి. వీటితో పాటు రోడ్డుపై దుమ్ము రేగుతుంది. దీంతో ఎదురుగా ఏ వాహనం వస్తుందో తెలియక గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రమాదాల జరగకుండా అధికారులు రోడ్డు పనులు పూర్తి చేయాలి. – అంజన్‌రెడ్డి, టీ.ఎన్.పల్లి

తారు వేయడంలో జాప్యం

కాంట్రాక్టర్‌కు బిల్లు మంజూరు కాకపోవడంతో తారు వేయడంలో జాప్యం జరుగుతోంది. పనులకు సంబంధించి సెప్టెంబరు వరకు ఈఓటీ(ఎక్స్‌టెన్షన్ ఆఫ్ టైమ్) ఉండేది. తిరిగి ఈఓటీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. బిల్లులు మంజూరు అయితే తిరిగి పనులు చేపడతారు. రోడ్డు నిర్మాణానికి సంబంధించి గ్రామస్తులు గ్రీవెన్స్‌లో కూడా ఫిర్యాదు చేశారు.

– ధనలక్ష్మి, ఆర్‌అండ్‌బీ జేఈ

ఈ-క్రాప్ బుకింగ్ త్వరగా పూర్తి చేయండి



ఈ-క్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ మహేష్

బత్తలపల్లి: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు త్వరితగతిన ఈ–క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలని వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందిని ఆర్డీఓ మహేష్ ఆదేశించారు. గురువారం గంటాపురంలో ఈ–క్రాప్ నమోదును ఆయన పరిశీలించారు. పంట విత్తిన తేదీ? సర్వే నంబర్, విస్తీర్ణం సరిగా నమోదు చేశారా? లేదా? అని తనిఖీ చేశారు. రైతులు తమ పంటను ఈ–క్రాప్ బుకింగ్ చేసుకోవాలని వివరించారు. వ్యవసాయాధికారులు, రెవెన్యూ సిబ్బంది సైతం క్షేత్రస్థాయిలోకి వెళ్లి పంటలను పరిశీలించి ఈ–క్రాప్ నమోదు చేయాలని ఆదేశించారు. ఏడీఏ లక్ష్మానాయక్, తహసీల్దార్ స్వర్ణలత, ఏఓ ఓబిరెడ్డి, ఏఈఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన దంపెట్ల, బత్తలపల్లిలో ప్రజా ఫిర్యాదులను పరిశీలించారు. అన్ని ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని తహసీల్దార్‌కు సూచించారు. ముష్టూరు గ్రామంలో రీ సర్వే పనులను పరిశీలించారు. నోటీసుల పంపిణీ, పనుల నాణ్యత, సమయపాలన వంటి అంశాలను సమీక్షించి, సర్వే ప్రక్రియలో భూ వివాదాలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్



డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తనకల్లు: కార్యకర్తలకు డిజిటల్ బుక్ అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అశోక్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ సీనియర్ నాయకుడు దేశాయి సంజీవరెడ్డి స్వగృహంలో గురువారం డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులపై అనేక రకాల వేధింపులు, అక్రమ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. ఎవరైతే వైఎస్సార్‌సీపీ శ్రేణులను ఇబ్బందులకు గురి చేస్తారో వారి వివరాలను డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేసిన వారిపై తగిన చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రామచంద్రారెడ్డి, నాయకులు దేశాయి భక్తవత్సల రెడ్డి, నాగభూషణరెడ్డి, బీఎస్ కలాం, మండల కమిటీ సభ్యులు నరేంద్ర, లక్ష్మీరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, నిజాం, సునీల్, షాన్‌వాజ్, నరసింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జంగంరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, సుధాకర్, పూల శంకర్, శివరాంరెడ్డి, మాధవరెడ్డి, హరినాథ్‌రెడ్డి, హరి, హేమశేఖర్‌రెడ్డి, చంద్రమోహన్, గౌస్, రాజశేఖర్, యశ్వంత్‌రెడ్డి, నరసింహులు, చంద్ర, కుమార్, రమణారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, సూరి, రఘునాథ్‌రెడ్డి, రమణ, భానుప్రకాష్, రమేష్‌నాయక్, జగదీష్, రమణ, తులసమ్మ, పర్వీన్ పాల్గొన్నారు.

బీసీల ద్రోహి సీఎం చంద్రబాబు



ఐక్యతను చాటుతున్న బీసీ నేతలు

కదిరి: బీసీలను పదే పదే మోసగించి బీసీల ద్రోహిగా మిగిలిపోయిన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది చంద్రబాబేనని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి అంపావతిని గోవిందు పేర్కొన్నారు. స్థానిక ఎన్‌జీఓ హోంలో గురువారం బీఎస్పీ కదిరి అసెంబ్లీ ఇన్‌చార్జ్ రామచంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో కాన్షీరాం 19వ వర్ధంతిని జరిపారు. ఈ సందర్భంగా గోవిందు మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించే బాధ్యత తనదంటూ చంద్రబాబు ఎప్పటి నుంచో చెబుతూ ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. 50 ఏళ్లు నిండిన బీసీలకు పింఛన్ రూ.4వేలు ఇస్తామని చెప్పి మోసగించారని గుర్తు చేశారు. టీడీపీ బీసీల పార్టీ అని చెప్పడమే కానీ బీసీలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. చంద్రబాబు బీసీలకిచ్చిన హామీలపై నవంబర్ 28న విజయవాడలోని ధర్నా చౌక్‌లో బీఎస్పీ మహాధర్నా చేపడుతున్నట్లు తెలియజేశారు. అంతకు మునుపు సీజేఐ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండించారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన



పుట్టపర్తిలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ ఫైరోజా బేగం

కదిరి టౌన్/ కదిరి అర్బన్/ గాండ్లపెంట/ఎన్‌పీకుంట/ తలుపుల/ ఓడీచెరువు/ ధర్మవరం/ ధర్మవరం అర్బన్/ పుట్టపర్తి టౌన్: జీఎస్టీ తగ్గింపుపై గురువారం కదిరి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, పట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గాండ్లపెంట సచివాలయం, ఎన్‌పీకుంట, తలుపుల, ఓడీచెరువు, ధర్మవరం పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల, ధర్మవరం ఏరియా ఆస్పత్రి,, పుట్టపర్తిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారులు, విద్యార్థులు, అధికారులు పుర వీధుల్లో ర్యాలీ చేపట్టారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీవితబీమాలో జీఎస్టీని 18 శాతం నుంచి 0కు తగ్గించిందన్నారు. కార్యక్రమాల్లో కదిరి ఆర్డీఓ వి.వి.ఎస్.శర్మ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కేశవరెడ్డి, మెడికల్ షాపుల నిర్వాహకులు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగేంద్రనాయక్, ఎంపీడీఓ పోలప్ప, డాక్టర్ ఉషారాణి, గాండ్లపెంట ఎంపీడీఓ సునిత, తహసీల్దార్ బాబురావు, సర్పంచ్ రహంతుల్లా, ఎంపీపీ సోమశేఖరరెడ్డి, ఎంఈఓ క్రిష్ణానాయక్, ఎన్‌పీకుంట వైద్యాధికారి డాక్టర్ జంషీర్, తలుపుల వైద్యాధికారి గయాజ్ అలీఖాన్, ఓడీచెరువు ఈఓఆర్డీ అంజినప్ప, ధర్మవరంలో డీఎంహెచ్‌ఓ ఫైరోజాబేగం, ఆర్డీఓ మహేష్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చెన్నారెడ్డి, జిల్లా అంధత్వ నివారణ అధికారి అనురాధ, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ చందు, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ సురేష్‌కుమార్, జీఎస్‌టీఓ అమర్‌నాథ్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు రామాంజనేయులు, దేవదానం నరేష్, కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున, పుట్టపర్తిలో డీఎంహెచ్‌ఓ ఫైరోజాబేగం, డాక్టర్ గాయిత్రీబాయ్, భవ్యయాదవ్, తహసీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, పాల్గొన్నారు.

బాలికలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి



పుట్టపర్తిలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

గాండ్లపెంట: బాలికలను అన్ని రంగాల్లో పోత్సహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతమ్మ సూచించారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం స్థానిక ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థినులు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబురావు, ఎంపీపీ సోమశేఖరరెడ్డి, ఎంపీడీఓ సునిత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌పీకుంట: బాలికలకు సమాన అవకాశాలు కల్పించాలని ఎంఈఓ గోపాల్‌నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం జి.మోహన్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నరసమ్మ పాల్గొన్నారు.

తనకల్లు: మండల కేంద్రంలో గురువారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ సయ్యద్ షాబుద్దీన్, ఎంపీడీఓ రామానాయక్, కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తలుపుల: మండల కేంద్రంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా గురువారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు దీప, అలివేలమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకట్రాముడు పాల్గొన్నారు.

పుట్టపర్తి టౌన్: పట్టణంలో గురువారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గణేష్ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. ఎంఈఓ ప్రసాద్, ఏపీఓ లక్ష్మీనారాయణ, ఏఓ రమణారెడ్డి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడిమర్రి : అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి సీడీపీఓ సరస్వతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలితమ్మ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకట రంగావు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కనగానపల్లి : మండల కేంద్రంలో గురువారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కే జీబీవీ ప్రిన్సిపాల్ నరసమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి : మండల కేంద్రంలో గురువారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేపట్టారు. తహసీల్దార్ సురేష్‌బాబు, ఎంపీడీఓ బాలకృష్ణుడు, ఎంఈఓ ప్రసూన్‌కుమార్‌నాయుడు. సీడీపీఓ కవితాదేవి తదిరులు పాల్గొన్నారు.

రెండు రోజులు మంచినీరు బంద్

కదిరి: చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి పట్టణానికి సరఫరా అవుతున్న మంచినీటి పైప్‌లైన్ దెబ్బతిన్నందున ఈ నెల 10,11వ తేదీల్లో కదిరిలో మంచినీరు సరఫరా ఉండదని మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయం



విద్యార్థులకు యూనిఫాం అందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు

ధర్మవరం అర్బన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు పూర్వ విద్యార్థులు సహకారం అందించడం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం పూర్వ విద్యార్థుల సహకారంతో విద్యార్థులకు యూనిఫాంను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డిగ్రీ కళాశాలలో 1997–2000 మధ్య చదువుకున్న పూర్వ విద్యార్థులు నాగభూషణం, కుళ్లాయప్ప, చిన్న వెంకటేషులు ఉచితంగా యూనిఫాంను అందించారన్నారు. అనంతరం దాతలను సన్మానించారు. అధ్యాపకులు పావని, షమీవుల్లా, గోపాల్‌నాయక్, భువనేశ్వరి, హైమావతి, పుష్పావతి, ఆనంద్, సరస్వతి, మీనా, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ట్రాన్స్‌ఫార్మర్ వేరేచోటికి మార్చండి

కదిరి టౌన్: కరావులకుంట వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోటికి మార్చాలని ఏపీ రైతు సంఘం నాయకులు గురువారం ట్రాన్స్‌కో డీఈ కృష్ణదేవ్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు జగన్మోహన్ మాట్లాడుతూ కరావులకుంట వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో అనేక మూగజీవాలు విద్యుదాఘాతానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. నాయకులు సుధాకర్‌రెడ్డి, ఆంజనేయులు, ఉదయ్, బాబ్జాన్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చీనీలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి



తాడిమర్రిలో చీనీతోటను పరిశీలిస్తున్న అధికారులు

ధర్మవరం రూరల్/ తాడిమర్రి: చీనీలో సస్య రక్షణలు చేపడితే అధిక దిగుబడులను సాధించవచ్చని చినీ, నిమ్మ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరెడ్డి, ఉద్యాన శాఖ జేడీ డాక్టర్ దేవమునిరెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్ రైతులకు సూచించారు. గురువారం గొట్లూరు, తాడిమర్రి గ్రామంలో చినీ తోటలను వారు పరిశీలించారు. చీనీలో కలుపు మందులు వాడకం వల్ల కలిగే నష్టాలు, కలుపు నివారణకు చేపట్టాల్సిన చర్యలు, పొలుసు పురుగు, నల్లి, వేరుకుళ్లు తెగుళ్ల నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. హెచ్‌ఓ అమరేశ్వరి, విస్తరణాధికారి హరిచరణ్‌రెడ్డి, వీహెచ్‌ఏలు ప్రవల్లిక, చరిత, ఎంఐఏఓ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి

బత్తలపల్లి: సంజీవపురం ఎస్సీ కాలనీలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఐ ధర్మవరం నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు డిమాండ్ చేశారు. గురువారం గ్రామానికి చేరుకుని ఎస్సీకాలనీవాసులతో సమావేశమయ్యారు. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి నీరు నిల్వ ఉండి దాదాపు 20 కుటుంబాలకు చెందిన వారి బియ్యం, బేడలు, టీవీ తదితర వస్తువులన్నీ తడిసి ముద్దయ్యాయని కాలనీవాసులు వివరించారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, సీపీఐ మండల కార్యదర్శి బండల వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు కళ్లాయప్ప, మండల సహాయ కార్యదర్శులు ఓబులేసు, గుండాల ఓబులేసు, దేవబ్రహ్మ, ధర్మవరం పట్టణ కార్యదర్శి పూల రవికుమార్, ఎర్రంశెట్టి రమణ, చేనేత నాయకుడు గుర్రం వెంకటనారాయణ పాల్గొన్నారు.

30 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయండి

ముదిగుబ్బ: మండల కేంద్రంలో 30 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని సీపీఐ నాయకులు గురువారం డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రెవెన్యూ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీనివాసులు, రాధాకృష్ణ, తుమ్మల చిన్నప్ప, నాయుడు, కూచి ప్రభాకర్ నాయుడు, ఆదెప్ప, శంకర్, మధు, భాస్కర్, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

వరి రైతులు అప్రమత్తంగా ఉండాలి

తలుపుల : వరి పంటలో తెల్లచీడ, దోమ, చిలకలు ఉండి పంటను దెబ్బతీస్తున్నాయని, మండల రైతులు అప్రమత్తం కావాలని ఏఓ నాగమధుసూదన్ సూచించారు. గురువారం ఆయన వేపమానిపేట ,గంజివారిపల్లి గ్రామాల్లో వరి పొలాలను పరిశీలించారు. తెగుళ్ల నివారణకు జింక్ 1 గ్రాము, ప్రొపినోట్ 2 గ్రాములు, డైమిథోయేట్ 2 ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు.

గ్రామీణ విద్యార్థిని ప్రతిభ



బంగారు పతకాన్నిఅందుకుంటున్న రజని

ఓడీచెరువు(అమడగూరు): అమడగూరు మండలం మారుతీపురం గ్రామానికి చెందిన రామలక్ష్మమ్మ, శ్రీనివాసులు కుమార్తె రజని బెంగుళూరు విద్యాలయం తెలుగు విభాగం (2024 బ్యాచ్)లో 9.3 మార్కులు సాధించి బంగారు పతకం సాధించింది. ఇటీవల యూనివర్సిటీ అధికారులు ఆమెకు బంగారు పతకం అందజేశారు. తాను చినగానిపల్లి ఉన్నత పాఠశాల, అమడగూరు ఇంటర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ విజ్ఞాన్ కళాశాలలో పూర్తి చేసినట్లు ఆమె తెలిపారు.

నిఘా నేత్రాలపై నిర్లక్ష్యమేల?



కింద పడిపోయిన సీసీ కెమెరాలు

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండలం పెడపల్లి బస్టాండులో పోలీసులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కింద పడినా పట్టించుకునే వారు కరువయ్యారు. నేరాల నియంత్రణలో భాగంగా పోలీసులు గతంలో పెడపల్లి బస్టాండు సర్కిల్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అయితే నెల రోజుల క్రితం ఉన్నఫలంగా అవి కిందపడిపోయాయి. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదు. దీంతో బస్టాండు సమీపంలోని ఓ యువకుడు సాగర్ వాటిని తీసి భద్ర పరచినట్లు చెప్పారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి సీసీ కెమెరాలను తిరిగి ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రాయల వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలి

పుట్టపర్తి టౌన్: అక్టోబర్ 17న జరిగే శ్రీకృష్ణదేవరాయల వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని చరిత్రకారుడు మైనాస్వామి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల ప్రధాన కార్యదర్శిని అజయ్‌జైన్‌ను కోరారు. ఈమేరకు గురువారం విజయవాడలో వినతిపత్రం అందజేశారు.

రోడ్డు నిబంధలను ఉల్లంఘిస్తే చర్యలు

తనకల్లు: రోడ్డు నిబంధలను ఉల్లంఘిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ గోపి హెచ్చరించారు. మండ్లిపల్లి వద్ద ఉన్న జాతీయ రహదారి–42పై గురువారం రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్, సీట్‌బెల్టు ఖచ్చితంగా పెట్టుకోవాలన్నారు. జేసీబీతో జాతీయ రహదారికి ఇరువైపులా పెరిగిన కంపచెట్లను తొలగింపజేశారు.

కబ్జా స్థలం పరిశీలన

ముదిగుబ్బ: మండల కేంద్రంలో జాతీయ రహదారి పక్కనున్న ప్రభుత్వ స్థలాన్ని కొందరు కబ్జా చేసి అక్రమంగా నిర్మాణం చేపట్టారు. స్థానికుల ఫిర్యాదు మేరకు గురువారం తహసీల్దార్ నారాయణస్వామి సర్పంచ్ లక్ష్మీదేవి పరిశీలించారు. ఆక్రమణకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

పొగాకు వాడకం ప్రాణాంతకం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

కదిరి టౌన్: పొగాకు వాడకం ప్రాణాంతకమని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగేంద్రనాయక్ పేర్కొన్నారు. గురువారం కుటాగుళ్ల హైస్కూల్‌లో విద్యార్థులతో పొగాకుతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జాతీయ పొగాకు నియంత్రణలో భాగంగా ఈనెల 9 నుంచి డిసెంబర్ 8 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ తెలిపారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. డాక్టర్ జోష్న, హరిప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం ప్రభాకర్, సైకాలజిస్ట్ రాణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు

ధర్మవరం రూరల్: గ్రామాల్లో ఎవరైనా గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ధర్మవరం రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం రాత్రి ముచ్చురామి గ్రామంలో ఆయన తన సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భం గ్రామసభ ఏర్పాటు చేసి చట్టాలపై అవగాహన కల్పించారు.